# ఇంజనీరింగ్ ఫీజుల పెంపునకు పచ్చజెండా

- టిఎఎఫ్ఆర్‌సి నిబంధనలకు సవరణ
- 6 అంశాల ప్రాతిపదికన ఖరారు చేయాలి
- విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ అమలు
- ఉత్తర్వులు విడుదల

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంజనీరింగ్ సహా వృత్తి విద్యా కోర్సుల ఫీజుల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఫీజుల నిర్ధారణకు సంబంధించి 2006లో తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ టిఎఎఫ్ఆర్‌సి రూపొందించిన నిబంధనలను సవరించాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా గురువారం జిఒ నెంబర్ 33ను విడుదల చేశారు. ఇంజనీరింగ్ సహా వృత్తి విద్యా కోర్సుల ఫీజులకు సంబంధించి విధివిధానాల రూపకల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి చైర్మన్‌గా అధికారుల కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఆ కమిటీ పలుమార్లు సమావేశమై 2025-28 బ్లాక్ పీరియెడ్ ఫీజులకు సంబంధించి అనేక అంశాలపై చర్చించింది. బుధవారం విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాకు ఉన్నత విద్యామండలి చైర్మన్, అధికారుల కమిటీ చైర్‌పర్సన్ వి బాలకిష్టారెడ్డి నివేదికను సమర్పించారు. అనంతరం ఉత్తర్వులను విడుదల చేశారు. ఇంజనీరింగ్ సహా వృత్తి విద్యా కోర్సుల ఫీజుల ఖరారు కోసం ఆరు అంశాలను ప్రాతిపదిక తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కాలేజీల్లో అంతర్గతంగా అందుకు సంబంధించి హామీ ఇచ్చేలా విధానం ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు మద్దతుగా ఉండాలనీ, వారి హాజరు, విద్యాపరమైన ప్రగతి, ప్లేస్‌మెంట్లను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానం (ఎఫ్ఆర్ఎస్)ను అమలు చేయాలని సూచించారు. ఆధార్‌తో అనుసంధానమైన విధానంతో నగదు చెల్లింపులుండాలనీ, అకౌంట్లు పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండాలని కాలేజీ యాజమాన్యాలను కోరారు. నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు చేయడం, అవార్డులు పొందడం, పరిశోధన పత్రాలను సమర్పించడంతోపాటు స్టార్టప్‌లు ప్రారంభించిన వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విద్యాసంస్థలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాంకేతిక విద్య పురోగతికి దోహదపడేలా ప్రణాళికను రూపొందించాలని వివరించారు. ఈ అంశాల ఆధారంగా ఇంజనీరింగ్ సహా వృత్తి విద్యా కోర్సుల ఫీజులను పెంచాలని సూచించారు.

**ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఫీజులపై ప్రశ్నార్థకం**

రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరం (2025-26)లో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజులకు సంబంధించి ప్రశ్నార్థకంగా మారింది. పాత ఫీజులు వర్తిస్తాయా? లేదంటే పెరుగుతాయా? అనే దానిపై స్పష్టత లేదు. పాత ఫీజులనే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దాన్ని సవాల్ చేస్తూ కొన్ని కాలేజీ యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. టిఎఎఫ్ఆర్‌సి ఖరారు చేసిన ఫీజులను నిర్ణయించాలని కోరాయి. ఆ ఫీజులను వసూలు చేసుకోవడానికి రెండు కాలేజీలకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. మరికొన్ని కాలేజీల పిటిషన్లను కొట్టేసింది. రెండు కాలేజీలకు ఫీజులను పెంచాలంటూ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ టిఎఎఫ్ఆర్‌సి, సాంకేతిక విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి కౌంటర్ దాఖలు చేశాయి. ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉన్నది. హైకోర్టు తీర్పు ఆధారంగా ఇంజనీరింగ్ ఫీజులు ఖరారు అయ్యే అవకాశమున్నది.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- అక్టోబర్ 12న ఎల్బీ స్టేడియంలో భారీ సభ
- జిఎడి ముఖ్యకార్యదర్శికి ఉద్యోగ జెఎసి నోటీసు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (జిఎడి) ముఖ్యకార్యదర్శి మహేష్‌దత్ ఎక్కాను గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో కలిసి నోటీసును అందజేశారు. అక్టోబర్ 12న లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులతో చలో హైదరాబాద్ కార్యక్రమం, వచ్చేనెల ఎనిమిది నుంచి 18 వరకు జిల్లాస్థాయి చైతన్య సదస్సుల నిర్వహణ కోసం చేపట్టే బస్సుయాత్ర వివరాలను ఎక్కాకు వివరించారు. వచ్చేనెల ఒకటో తేదీన తలపెట్టిన పెన్షన్ విద్రోహ దినం పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం జగదీశ్వర్, శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం జంగ్ సైరన్ మోగిస్తున్నామని అన్నారు. ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు, ఆరోగ్య కార్డులు, డీఏలు విడుదల చేస్తామనీ, పీఆర్సీని అమలు చేస్తామంటూ హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం వాటిని పరిష్కరించలేదని విమర్శించారు. వచ్చేనెల ఎనిమిది నుంచి జిల్లాల్లో బస్సుయాత్ర చేపట్టి సభలను నిర్వహిస్తామని వివరించారు. ఉద్యోగులు రిటైర్ అయ్యి రెండేండ్లు అవుతున్నా బెనిఫిట్లు ఇవ్వడం లేదన్నారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సంబంధించి రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లులున్నాయని చెప్పారు. నెలకు రూ.700 కోట్లు చెల్లిస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చిందని అన్నారు. కానీ అవి కూడా చెల్లించడం లేదన్నారు. దీంతో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. తమకు రావాల్సిన వాటి గురించే అడుగుతున్నామని అన్నారు. వచ్చేనెల ఒకటో తేదీన పాత పెన్షన్ సాధన కార్యక్రమంతో ఉద్యమాన్ని మొదలు పెడతామని చెప్పారు. అక్టోబర్ 12న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో భారీ సభను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ నాయకులు పి దామోదర్‌రెడ్డి, జి సదానందంగౌడ్, ముజీబ్ హుస్సేనీ, పి మధుసూదన్‌రెడ్డి, స్థితప్రజ్ఞ, ఎ సత్యనారాయణ, కస్తూరి వెంకటేశ్వర్లు, బి శ్యామ్, కటకం రమేష్, మామిడి నారాయణ, గుండు లక్ష్మణ్, సంగి రమేష్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ విజయవాడ**

బిట్వీన్ **యఫ్.ఏ.నెం. 718/2024**

**M/s. గ్లోబల్ ఎంట్రోపోలీస్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్,** రిప్రజెంటెడ్ బై ఇట్స్ ఆథరైజ్డ్ సిగ్నెటరీ, బెంగుళూరు మరియు మరొకరు ...అప్పిలెంట్స్

అండ్

**శ్రీమతి బీరపల్లి విష్ణుప్రియ**
మరియు మరో ముగ్గురు ...రెస్పాండెంట్స్

టు **నోటీసు**

**రెస్పాండెంటు నెం.3:**
**కె. రమణారెడ్డి,** S/o. శ్రీ వెంకటరెడ్డి,
నివాసం: ప్లాటు నెం.16/19, 301, మహాలక్ష్మి నివాసం, సాగర్ సొసైటీ, రోడ్డు నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.

(రాష్ట్ర కమీషన్ ఇచ్చిన IA/752/2025 ఉత్తర్వు ప్రకారం ఈ నోటీసు మీకు జారీచేయబడినది)

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పై తెలిపిన అప్పిలెంట్స్ అయిన **గ్లోబల్ ఎంట్రోపోలీస్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్** మరియు మరొకరు మహారాజశ్రీ డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రెడ్రస్సల్ కమీషన్-II, విశాఖపట్నంలో C.C/58/2021 ఇచ్చిన ఉత్తర్వులపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడలో పైనెంబరు పిటీషన్‌లోని F.A/718/2024 పై అప్పిలెంట్స్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో మీయొక్క హాజరు కొరకు **తేది. 09-09-2025**కి వాయిదా అయివున్నది. కావున పై తెలిపిన **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, అశోక్‌నగర్, విజయవాడ** నందు **తేది.09-09-2025 ఉ॥గం॥10.30 ని॥లకు** మీరు స్వయంగా గానీ లేదా మీ తరుపున న్యాయవాది గారి ద్వారాగాని హాజరై మీయొక్క అభ్యంతరములు, ఆక్షేపణలు తెలియపర్చవలెను. లేనియెడల పైపిటీషన్ మీ పరోక్షమందు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

**MANNE HARI BABU**, Advocate
# 27-6-84, 2nd Floor, Sri Krishna Estate,
Prakasam Road, Governorpet, Vijayawada.
Andhra Pradesh. **Cell: 94404 82681**

**IN THE COURT OF THE MACT CUM HON'BLE XXVI ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT, AT :: HYDERABAD**
**MVOP.No. 72 OF 2024**

BETWEEN:
Rathode Subash and others. ...Petitioners.
AND
Mohammad Suleman and others. ...Respondents.

To,
Mohd. Azam Ali S/o Ad. Omer Ali, Age Major, Driver of Ashok Leyland Tanker bearing No.AP-24-W-5429, R/o: H.No. 17-2-951/3, Rani Bazar, Yakutpura, Hyderabad, TS-500 023. ...Respondent No.3.

Please take notice that the petitioners have filed the above O.P. against you No.3 and other respondents for claiming compensation for the death of Rathod Tulsi W/o Rathod Subhash in the road accident which was occurred on 13-11-2023 at about 16:40 hours infront of AG College Main Gate, Rajendranagar, Cyberabad by respondent's No.1 vehicle i.e., Ashok Leyland Tanker bearing No.AP-24-W-5429. The said O.P. is posted to **18.09.2025** at **10.30** AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before this Hon'ble Court by 10.30 AM in person or through your counsel, failing which the matter will be decided on your obsence. Hence this notice.

//BY ORDER OF THE COURT//
**M. VIJAY REDDY**
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh Amberpet, Hyderabad
Ph: 7673904549 9330489999

**జెన్నారా క్లినిక్‌ను ప్రారంభించిన నటి శ్రియా**

**హైదరాబాద్ :** చర్మ సంరక్షణ, సౌందర్య చికిత్సలను అందించే జెన్నారా క్లినిక్స్ నగరంలోని కొండాపూర్‌లో నూతన సెంటర్‌ను ఏర్పాటు చేసింది. గురువారం దీనిని నటి శ్రియా శరణ్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రపంచస్థాయి వైద్య నైపుణ్యం, అత్యాధునిక సాంకేతికతను మేళవించి, జెన్నారా క్లినిక్స్ హైదరాబాద్‌లో చర్మ, వెంట్రుకల సంరక్షణలో అత్యంత విశ్వసనీయమైన క్లినిక్స్‌లో ఒకటిగా ఎదిగిందని నిర్వాహకులు తెలిపారు.

# మోడీకి ఏజెంట్‌గా ఎన్నికల కమిషన్

- ట్రంప్ సుంకాలపై స్పందించని మోడీ
- ఎర్రకోట సాక్షిగా అమరవీరులకు అవమానం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య

ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ వీరయ్య

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ప్రజాస్వామ్యయుతంగా, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాని నరేంద్ర మోడీకి ఏజెంట్‌గా పని చేస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య విమర్శించారు. సిపిఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం రాత్రి మహబూబాబాద్ జిల్లాలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో స్మారక ఉపన్యాసం చేశారు. జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన 'రాజ్యాంగ విలువలు-ట్రంప్ టారిఫ్ దాడి-కేంద్ర ప్రభుత్వ వైఖరి' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో వీరయ్య మాట్లాడారు. భారతదేశంపై భారాలు వేస్తానని ట్రంప్ ప్రకటించినా మోడీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఎర్రకోట సాక్షిగా మోడీ అమరవీరులను అవమానించేలా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా.. ప్రజాస్వామ్య లౌకిక విలువలు, రాజ్యాంగం రక్షణ కోసం సీతారాం ఏచూరి పని చేశారని వీరయ్య గుర్తు చేశారు. ప్రస్తుతం బీహార్‌లో ఓట్ల తొలగింపు, ఎన్నికల కమిషన్ వైఖరి, మాలేగా ఉగ్రవాద కుట్ర కేసులో నిందితులకు క్లీన్‌చీట్ రావడం, ట్రంప్ అధిక పన్నులపై దేశంలో చర్చ జరుగుతోందని చెప్పారు. ట్రంప్ గెలుపు కోసం అమెరికా వెళ్లి మోడీ ప్రచారం చేశారని తెలిపారు. దేశంలో ధరలు, మహిళలు, గిరిజనులపై దాడులు పెరిగిపోతున్నాయని, వాటిపై చర్చ జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై చర్చించకుండా ప్రధాని మోడీ ఆగస్టు 15న ఎర్రకోటపై చేసిన ఉపన్యాసంలో ఆర్ఎస్ఎస్ గురించి మాట్లాడి.. మహా పాపం చేశారని అన్నారు.

బీహార్‌లో మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనుండగా ఎన్నికల కమిషన్ మార్పులు చేర్పుల పేరుతో 65,50,000 ఓట్లను తొలగించిందని, ఎందుకోసం తొలగించిందని ప్రశ్నించారు. కొండ కోనల్లో.. అడవుల్లో ఉన్న వారికి కూడా ఓటు హక్కు కల్పించడం కమిషన్ పని అన్నారు. అంతేగానీ బిజెపికి వ్యతిరేకంగా ఉన్న వారి ఓట్లు తొలగించడం కాదని విమర్శించారు. బిజెపి పోలింగ్ బూత్ వారీగా సర్వే చేసి వారికి పడని ఓట్ల జాబితాలను తొలగించిందనే విమర్శలు వెలువెత్తుతున్నాయ న్నారు. ఎన్నికల కమిషన్ కొత్తగా పౌరసత్వం అడుగుతుందని, పౌరసత్వానికి ఓటు హక్కుకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. చట్టం, రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ఎన్నికల కమిషన్ పని చేస్తోందని, ఇది రాజ్యాంగ మూల సూత్రాలకు ప్రమాదం అని అన్నారు. బీహార్ ఓట్ల తారుమారుపై పార్లమెంట్‌లో చర్చించకుండా అడ్డదారుల్లో మూడు బిల్లులను పాస్ చేసుకున్నారని విమర్శించారు. ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రులు ఏదైనా కేసులో నెల రోజులకుపైగా జైల్లో ఉంటే పదవి కోల్పోయేలా బిల్లు తెచ్చారని, ఇది బిజెపియేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విఘాతం కలిగించేలా ఉందని అన్నారు. అలాగే, మరో ఎంప్లాయిమెంట్ లింక్ స్కీం బిల్లు తెచ్చారని, ఇది కార్మికుల శ్రమ శక్తిని దోచుకునేలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుణిగంటి రాజన్న, ఆకుల రాజు, అల్వాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్ ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL- CUM-XXIV ADDL CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.P. No. 615 OF 2024**

Between:-
Asiya Begum ... Petitioners
AND
Vaddeboina Saritha and Others. ...Respondents

To,
1.Vaddeboina Saritha,W/o.Vaddeboina Nagaraju, Occ:Business/Owner of R/o. H.No.8-48,Chandupatla Village,Nakrekal Mandal,Nalgonda District. ...R1

2.Anil Chowhan @Mudavath Anil Chawan ,S/o.Bheemla Naik, Occ: Driver of TATA Auto Tralley,bearing No.TS-05 UE 7449, R/o.Plot No.38, NNRSC No.676,Om Sai Nagar Colony, Nagaram,Keesara Mandal,Medchal-Malkajgiri,Dist. ...R3

**NOTICE**

Please take notice that the above OP is filed against you and others for grant of compensation and the above case is posted for your appearance on 24-9-2025. at 10:30 a.m. in person or by an Advocate, failing which the case will be decided on merits in your absence.

// BY ORDER OF THE COURT //
**P.CHANDRAMOULI**
**P. PANDU RANGA SWAMY,**
Advocates
Bangaru Enclave,
Kharman Ghatt,Hyderabad.

## నేనూ, సీతక్క... సమ్మక్క సారక్కల్లా కలిసున్నాం

- మంత్రి కొండా సురేఖ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

'సమ్మక్క, సారక్క మాదిరిగా నేనూ, సీతక్క కలిసున్నాం. ఆమె నాకు సోదరితో సమానం. ఆమెతో నాది ఉద్యమాల పేగు బంధం. అటువంటి మాపై కొంతమంది మీడియా సోదరులు సంఘర్షణపూరిత వాతావరణం సృష్టించాలని వార్తలు రాస్తున్నవారినీ, రాయించుకుంటూ పైశాచిక ఆనందం పొందుతున్న వారిని గమనిస్తున్నా. ఈ రోజు జరిగిన పరిణామాలు నిశితంగా పరిశీలించిన తర్వాత చాలా బాధేసింది. మా ఇద్దరి మధ్య ఎటువంటి గొడవలేనప్పుడు అతి కొంతమంది మీడియా సోదరులకి ఎందుకు అంత ఉత్సాహమో నాకు అర్థం కావడం లేదు' అని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కారు పార్టీ నేతలకు, కల్వకుంట్ల గడీలకు ఊడిగం చేసే అతి కొంతమందికి కలలో కూడా కలవరం తీసుకువచ్చేంతటి జ్ఞాపకాలుగా తానూ, సీతక్క మారామని తెలిపారు. సీతక్క చెప్పినట్టు రాజకీయాల్లో ఆడబిడ్డలను ఎదగనివ్వాలని కోరారు. ఆడబిడ్డలు ఎదుగుతుంటే ఓర్వలేని కొన్ని శక్తులు పితృస్వామిక వ్యవస్థ పుత్రులు, మిత్రులు అని విమర్శించారు. సొంత ఇంట్లోని ఆడబిడ్డలను ఏకాకి చేస్తూ దృష్ట రాజకీయం చేస్తున్నారని తెలిపారు. గత సమ్మక్క, సారక్క జాతరకు డెంగ్యూ జ్వరంతో రాలేకపోయాననీ, దాన్ని చూపెట్టి సీతక్క, తన మధ్య విభేదాలు సృష్టించాలని కొందరు చూడటం దుర్మార్గమని పేర్కొన్నారు. తమ మధ్య రాజకీయ విభేదాలు గానీ, వ్యక్తిగత విభేదాలుగానీ లేవని స్పష్టం చేశారు. ఒక మహిళ రాష్ట్ర రాజకీయాల స్థాయికి ఎదగడమంటే సామాన్యమైన విషయం కాదని మీడియా సోదరులు గుర్తించాలని సూచించారు. లేనిపోని, అపోహలు సృష్టించే వార్తలు రాయొద్దని హితవు పలికారు.

# కెటిఆర్ భాష.. 'థర్డ్ క్లాస్'

- ఉప రాష్ట్రపతి ఎన్నికలో తెలంగాణ బిడ్డకు మద్దతివ్వాలి
- ఈ నెల 24న గంగాధరలో 'జనహిత పాదయాత్ర'
- రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

యూరియా కొరతపై ప్రతిపక్షాల విమర్శలకు రవాణ, బిసి సంక్షేమశాఖ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. కెటిఆర్ మాటతీరు 'థర్డ్ క్లాస్'గా మారిందని విమర్శించారు. యూరియా సరఫరా కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని, ఈ విషయం పదేండ్లు మంత్రిగా పని చేసిన కేటీఆర్‌కు తెలియదా? అని ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేసిందని, ఆయన తెలంగాణ బిడ్డ అని చెప్పారు. ఈ విషయంలో బిజెపితో కలిపి వెళ్తారా, లేదా తెలంగాణ బిడ్డకు మద్దతిస్తారా అనేది బీఆర్ఎస్ నేతల విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ప్రజా పాలనలో అమలు చేస్తున్న పథకాలను చూసి ఓర్వలేకే బిజెపి, బీఆర్ఎస్ తమ ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నాయని ఆరోపించారు. ఎరువుల కొరత సృష్టించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇది రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని అంశం కాదని, రైతులు గమనించాలని కోరారు. ఎరువుల సరఫరా బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని, దీనిపై తమ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రాన్ని కలిసిందని స్పష్టం చేశారు. కరీంనగర్ ఎంపి బండి సంజయ్ ఈ సమస్యపై చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వివక్షతో వ్యవహరిస్తోందని, బిజెపికి అనుబంధంగా పని చేస్తోందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. పదేండ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరంలో రెండో టిఎంసి నీరు తీసుకురాలేకపోయిందని విమర్శించారు. యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందన్నారు. తాము ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు.

**ఈ నెల 24న గంగాధరలో 'జనహిత పాదయాత్ర'**

'జనహిత పాదయాత్ర' ఈనెల 24వ తేదీన కరీంనగర్ జిల్లాలో పున:ప్రారంభం కానుందని, చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల నుంచి కురిక్యాల చౌరస్తా మీదుగా ఈ పాదయాత్ర సాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ యాత్రలో పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు, అనుబంధ సంఘాలకు విజ్ఞప్తి చేశారు. 'జనహిత పాదయాత్ర' ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో నేరుగా తెలుసుకుంటామని, వారి కష్టాలను తెలుసుకుంటామని అన్నారు. ఈ యాత్రకు ముఖ్యమంత్రి సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు.

## ఆ విద్యార్థులకు సర్టిఫికెట్లు తిరిగివ్వాలి

- హైదరాబాద్ కలెక్టర్‌కు హెచ్ఆర్‌సి ఆదేశం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని సుల్తాన్-ఉల్-ఉలూమ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి చెందిన 17 మంది బి.ఫార్మసీ విద్యార్థులకు టీసీతో సహా వారి ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కోరింది. ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నారనే సాకుతో బదిలీ సర్టిఫికెట్ (టిసి)లతో సహా వారి ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్‌లను కళాశాల అధికారులు చట్టవిరుద్ధంగా నిలిపివేస్తున్నారని, తద్వారా వారి ఉన్నత విద్య అవకాశాలు ప్రమాదంలో పడ్డాయని ఆరోపిస్తూ విద్యార్థులు కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసును డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో తెలంగాణ మానవ హక్కుల కమిషన్ విచారించి ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థినీ వంగల శ్రుతి కేసులో జారీ చేసిన మునపటి ఉత్తర్వులను, యూజీసీ మార్గదర్శకాలను కమిషన్ ప్రస్తావించింది. సర్టిఫికెట్ల నిలిపివేత లాంటివి ప్రాథమిక మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం విద్యా హక్కును అడ్డుకోవడమేనని కమిషన్ స్పష్టం చేసింది. అన్ని సర్టిఫికెట్‌లను వెంటనే విద్యార్థులకు తిరిగి ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

# అత్యంత ప్రతిష్టాత్మకంగా మేడారం జాతర

- అత్యధిక నిధులు కేటాయింపు : మంత్రి సీతక్క

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందనీ, సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్టు మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం జాతరం కోసం ఎన్నడూ లేని విధంగా ఈ దఫా రూ.150 కోట్లు ఖర్చు చేయనున్నట్టు వెల్లడించారు. వచ్చే ఏడాది మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర జనవరి 22 నుండి 31 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతుందని తెలిపారు. జాతర కోసం శాశ్వత పనులు చేపడుతున్నామని, జంపన్న వాగు నుంచి మేడారం ప్రాంగణం వరకు డబుల్ రోడ్లు, డివైడర్లు, 29 ఎకరాల దేవాదాయ శాఖ భూమిలో స్మృతివనం అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామనీ, భద్రత కోసం 12 వేల మంది పోలీస్ సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. "13వ శతాబ్దపు ఈ చారిత్రక జాతరను భవిష్యత్ తరాలకు అందించే విధంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం" అని మంత్రి చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..సమ్మక్క - సారలమ్మ గత జాతరకు రూ. 105 కోట్లు కేటాయిస్తే... ఈసారి రూ.150 కోట్లు కేటాయించినట్టు గుర్తు చేశారు. ఆదివాసీ పూజారులు కోరిన విధంగా జాతర పనులు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. గత ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖను పట్టించుకోలేదనీ.. అయితే ప్రజా ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని తెలిపారు.

**పనుల జాతర 2025 పోస్టర్ విడుదల**

పంచాయతీరాజ్ శాఖ తరపున 'పనుల జాతర 2025 పోస్టర్'ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా లక్షా 15 వేల పనులు రూ.2,198 కోట్ల వ్యయంతో ప్రారంభం కానున్నాయి. "సమ్మక్క-సారలమ్మ వలె అక్కాచెల్లెళ్ల లాగా మేము కలిసే ఉన్నామన్నారు. రాజకీయాల్లో మహిళలు ఎదగడానికి సమాజం సహకరించాలి. ఆడబిడ్డలు ఇంట్లో, సమాజంలో సంతోషంగా ఉంటే సమాజం బాగుంటుంది" అని తెలిపారు.

**కెటిఆర్‌ది డర్టీ మైండ్..**

కాంగ్రెస్ ది థర్డ్ క్లాస్ ప్రభుత్వం అని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క మండి పడ్డారు. "థర్డ్ క్లాస్ అంటే ఏంటో కేటీఆర్ చెప్పాలని నిలదీశారు. కెటిఆర్ అహంకారంతో, మాట్లాడుతున్నారనీ, ఆయనది డర్టీ మైండ్ అని విమర్శించారు. కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేయించడం కెటిఆర్ డర్టీ మైండ్ కు నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్‌లో నారాయణ విద్యార్థులకు 2 బంగారు పతకాలు

**ప్రజాశక్తి - హైదరాబాద్**

అంతర్జాతీయ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్‌లో భారత్ తరఫున నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు రెండు బంగారు పతకాలను సాధించారు. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 11 నుంచి 21 వరకు ముంబయిలో అంతర్జాతీయ ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్‌లో నారాయణ విద్యార్థులు బణిబ్రత మాజీ, అక్షత్ శ్రీవాస్తవ బంగారు పతకాలను సాధించారని తెలిపారు. భారతీయ విద్యార్థులు నాలుగు బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించే అందులో రెండు బంగారు పతకాలను నారాయణ విద్యార్థులే సాధించారని వివరించారు. ఇది భారతదేశానికే గర్వకారణమని తెలిపారు. నిరంతర శ్రమ, అధ్యాపకుల మార్గదర్శకత్వంలో వారు ఈ విజయాన్ని సాధించారని పేర్కొన్నారు.

**మహా రాజశ్రీ నంద్యాల 3వ అదనపు జిల్లా జడ్జ్ కోర్ట్ నందు**
**A.S. No: 15/2021**

దలాల్ హుస్సేన్ సాబ్. ...అప్పిలెంట్
V/s
యస్. మహమ్మద్ భాష మరియు ఇతరులు. ...రెస్పాండెంట్స్

To,
**రెస్పాండెంటు నెం: 6**
కన్నేష్ బేగం, D/o. యస్.యజాద్ హుస్సేన్, W/o. జన్నిమియ్యా, R/o. ఇంటి నెం:235-136, అంజయ్యనగర్ గచ్చిబౌలి ఏరియా, హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా.

**రెస్పాండెంటు నెం: 8**
శెహనాజ్ బేగం, D/o. యస్.యజాద్ హుస్సేన్, W/o. ముర్తుజా, C/o. ఇంటి నెం: 235-136, అంజయ్యనగర్ గచ్చిబౌలి ఏరియా, హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా.

**రెస్పాండెంటు నెం: 20**
సయద్ అంతుమ్ జహరా బేగం, W/o. లేట్ సయద్ సజ్జద్ హుస్సేన్, C/o. ఇంటి నెం: 235-136, అంజయ్యనగర్ గచ్చిబౌలి ఏరియా, హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా.

**రెస్పాండెంటు నెం: 21**
సయద్ యింతియజ్ హుస్సేన్, S/o. లేట్ సయద్ సజ్జద్ హుస్సేన్, C/o. ఇంటి నెం: 235-136, అంజయ్యనగర్ గచ్చిబౌలి ఏరియా, హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా.

**రెస్పాండెంటు నెం: 22**
సయద్ జైనబ్ బేగం, D/o. లేట్ సయద్ సజ్జద్ హుస్సేన్, C/O. ఇంటి నెం: 235-136, అంజయ్యనగర్ గచ్చిబౌలి ఏరియా, హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా.

**రెస్పాండెంటు నెం: 23**
సయద్ హుస్సేన్ బేగం, D/o. లేట్ సయద్ సజ్జద్ హుస్సేన్, C/O. ఇంటి నెం: 235-136, అంజయ్యనగర్ గచ్చిబౌలి ఏరియా, హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా.

**రెస్పాండెంట్స్ కు అప్పీలు నోటీసు**

అప్పిలెంట్, క్రింది కోర్టు వారు ఇచ్చిన డిక్రీపై అప్పీలు దాఖలు చేసి అందులో మిమ్ములను 6, 8, 20, 21, 22 మరియు 23 రెస్పాండెంట్స్ గా చూపించినారు. సదరు అప్పీలులో మీయొక్క హజరు నిమిత్తము 10-09-2025 వ తేదీన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టునందు మీరు స్వయంగా కానీ లేదా మీ వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపనలు ఏమైనా ఉంటే తెలుపుకోవలెను లేనియడల మీకు పరోక్షముగా అప్పీలు తీర్మానించెదరు.

**(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా తేది: 10-09-2025.**

ఇట్లు
**(బి.రామమోహన్ రెడ్డి)**
పిటీషనర్ తరుపు,
న్యాయవాది, నంద్యాల.

# 30 రోజుల కస్టడీ బిల్లు.. ప్రతిపక్షాలపై బిజెపి కుట్ర

- విపక్షాలను అణచివేసే చర్య
- చట్టపరమైన విధానాలను తప్పించుకునేందుకు ఎత్తుగడలు
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే కుట్రలను తిప్పికొట్టాలి : తమ్మినేని

కోటయ్య సంస్మరణ సభలో మాట్లాడుతున్న తమ్మినేని

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

దేశానికి, ప్రజలందరికీ ఉపయోగపడే చట్టాలు చేయాల్సిన పార్లమెంట్.. చట్టపరమైన విధానాలను తప్పించుకునే దిశగా బిల్లులు తీసుకొస్తోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు. సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ అధ్యక్షతన గురువారం స్థానిక టేకులపల్లి గోశాల సమీపంలో జరిగిన దొంగల కోటయ్య సంస్మరణ సభలో తమ్మినేని ప్రసంగించారు. దొంగల కోటయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అవినీతి వంటి తీవ్రమైన నేరారోపణలతో 30 రోజుల పాటు కస్టడీలో ఉంటే ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రినైనా పదవిలో నుంచి తీసివేసే బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో బుధవారం ప్రవేశపెట్టిందన్నారు. నేరం రుజువైె ఐదేళ్లపాటు శిక్షపడే అవకాశం ఉండే సెక్షన్‌లు ఉన్న కేసులో నిందితులు ఎవరైనా 30 రోజులపాటు బెయిల్ లేకుండా జైల్లో ఉంటే పదవి నుంచి తొలగించొచ్చని తెలిపారు. ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోయటమే లక్ష్యంగా ఈ బిల్లును కేంద్రం తీసుకొచ్చిందని విమర్శించారు.

**ప్రతిపక్షాలను అణచివేసే చర్య**

ప్రతిపక్షాలను అణచివేసే చర్యల్లో భాగమే 30 రోజుల కస్టడీ బిల్లు అని తమ్మినేని తెలిపారు. బిజెపేతర పార్టీలు ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా అక్కడ కక్షపూరితంగా వ్యవహరించేందుకు ఈ బిల్లు ఓ అస్త్రంలాంటిదన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే క్రమంలోనూ నాయకులపై సంబంధిత సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేయొచ్చన్నారు. రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ తన చెప్పుచేతల్లో పెట్టుకున్న బిజెపి కోర్టుల్లోనూ తనకు అనుకూల తీర్పులు ఇప్పించుకుంటున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. చట్టబద్ధంగా ఎన్నికైన వ్యక్తులను తొలగించేందుకు ఇంకోదారి లేక బిజెపి ఈ కుట్ర చేస్తోందన్నారు. బీహార్‌లో 65 లక్షల ఓట్లను తీసేశారని, దీనిలో ముస్లిం, క్రిస్టియన్, ప్రతిపక్ష పార్టీల ఓట్లే ఉన్నాయని తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 35వేల ఓట్లు తీసివేస్తే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు గెలిచేదెట్లా అని ప్రశ్నించారు. ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన తేజస్వీయాదవ్ ఓటే ఓటర్ లిస్టులో లేదన్నారు. ఎలక్షన్ కమిషన్ సైతం బిజెపి ఏజెంట్‌లా మారిపోయి రాహుల్‌గాంధీని అఫిడవిట్ ఇవ్వాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. క్రిమినల్ నేరాలను విచారించే సిబిఐ, ఆర్థిక నేరాలను విచారించే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)లను బిజెపి చెప్పుచేతల్లో ఉంచుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాయావతి, లాలూ ప్రసాద్ యాదవ్‌ను అరెస్టు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మురికున్న నేతలు బిజెపిలో చేరగానే నిర్మాతో శుద్ధి చేసినట్టుగా ఆ పార్టీ తీరు ఉందన్నారు. ఎన్ని చేసినా ప్రతిపక్ష పార్టీలు అధికారంలోకి వస్తే ఈ 30 రోజుల కస్టడీ కేసు ఆధారంగా బొక్కలో వేసి అనర్హత వేటు వేస్తారన్నారు.

**పెట్టుబడిదారి లక్షణాల్లో భాగమే ఈ కుట్రలు**

ఈ బిల్లు మోడీ బుర్రలో పుట్టిన ఆలోచనో... అమిత్‌షా చేస్తున్న కుట్రో.. ఏ సుప్రీం కోర్టో చేస్తున్న గారడీ కాదని పెట్టుబడిదారుల సహజ లక్షణమే ఇదని తమ్మినేని అన్నారు. ఈ విషయాన్ని 160 సంవత్సరాల కిందటే మార్క్స్ చెప్పారని గుర్తు చేశారు. 'పెట్టుబడిదారి సమాజం ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును, పార్లమెంట్‌ను, చట్టాన్ని, కోర్టును తన ప్రయోజనాలకు, కార్పొరేట్ శక్తుల లాభాలకు ఉపయోగపడేంత కాలం ఉపయోగించుకుంటుంది.. ఈ వ్యవస్థలేవీ ఉపయోగం పడవనుకున్నప్పుడు రద్దు చేసుకుంటూ పోతుంది..' అన్నారు. ఈ ప్రజాస్వామ్య హననాన్ని ఎండ గట్టాల్సిన అవసరం ఉందన్నారు. అలా ఎండగట్టే దమ్ము, ధైర్యం ఉన్నవారే కమ్యూనిస్టులు అని చెప్పారు.

**జాలీ దయ లేనివాడు కమ్యూనిస్టే కాదు..**

కమ్యూనిస్టులను మించిన మానవతావాదులు ఎవరూ లేరని తమ్మినేని అన్నారు. కమ్యూనిస్టులపై బూర్జువా పార్టీలు జాలి, దయ లేని మనుషులుగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. మనుషులందర్నీ ప్రేమించే లక్షణం కమ్యూనిస్టులదన్నారు. కమ్యూనిస్టుల కోపం, ద్వేషం పెట్టుబడిదారి వ్యవస్థపైనే అని వివరించారు. సమానత్వానికి ఆటంకం కల్పించే పెట్టుబడిదారీ సమాజాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అంతకుముందు కోటయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

**ప్రజా సమస్యలపై పోరాడినా ఆ కేసు పెట్టొచ్చు: బి.వెంకట్**

ప్రజా సమస్యలపై పోరాడిన నాయకులపైనా 30 రోజుల కస్టడీ కేసు నమోదు చేయొచ్చని, తద్వారా వారు ప్రజాప్రతినిధిగా ఉంటే అనర్హత వేటు వేయొచ్చని వ్యవసాయ కార్మికసంఘం జాతీయ కార్యదర్శి బి వెంకట్ తెలిపారు. పోడుభూముల పోరాటాలు చేసినా, ఇండ్ల స్థలాల కోసం ఉద్యమించినా, యూరియా కోసం రైతులు రోడ్డెక్కినా ఈ కస్టడీ కేసు నమోదు చేయొచ్చన్నారు. ప్రజా పోరాటాలను అణచడానికి మోడీ ప్రభుత్వం ఈ చట్టం తెచ్చిందన్నారు. రాబోయే ప్రమాదాన్ని గుర్తెరిగే ఇటువంటి చట్టాలను బిజెపి చేస్తోందన్నారు. అమెరికా నిరుద్యోగాన్ని భారతదేశానికి ఎగుమతి చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు.

కోటయ్య సంస్మరణ సభ సందర్భంగా 'నవతెలంగాణ' ప్రచురించిన ప్రత్యేక సంచికను తమ్మినేని తదితరులు ఆవిష్కరించారు. ఈ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు రాజారావు, పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, మాదినేని రమేష్, బంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, దొంగల కోటయ్య కుమారుడు- ఖానాపురం హవేలీ కార్యదర్శి తిరుపతిరావు, అల్లుడు డాక్టర్ అల్లాడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు నుంచి వచ్చే కలుషిత చెరువు

## సిద్దిపేట చెత్తతో మా ఊరికే ప్రమాదం

- క్వింటాళ్ల కొద్ది చనిపోతున్న చేపలు
- వరదరాజుపల్లి గ్రామస్తుల ఆవేదన

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సిద్దిపేట మున్సిపాలిటీ చెత్త డంపింగ్ యార్డు మా గ్రామానికి ప్రమాదకరంగా మారిందని పరిసర గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు నుంచి వచ్చే కలుషిత నీరు చెరువుల్లో కలిసి చేపలు చనిపోతున్నాయని సిద్దిపేట జిల్లా తొగుట మండల పరిధిలోని వరదరాజుపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గుట్టకాడికుంట, దమ్మాయి చెరువు, కాసాయికుంట, పిండే చెరువు, పెచ్చేరువుల నీరు సిద్దిపేట మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ వల్ల పూర్తిగా కలిషితమై అందులో క్వింటాళ్ల కొద్ది చేపలు చనిపోతున్నాయని తెలిపారు. గురువారం చెరువులో చనిపోయిన చేపలను చూసి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. 2006-07లో గుడికందుల రెవెన్యూ పరిధిలోని వరదరాజుపల్లి గ్రామ శివారులో సిద్దిపేట మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేశారని చెప్పారు. అప్పటి నుంచి సిద్దిపేట చెత్తను తెచ్చి కుప్పలు, తెప్పలుగా పోస్తూనే ఉన్నారని వాపోయారు. ఈ వ్యర్థ పదార్థాల నుంచి వచ్చే దుర్వాసన, రసాయనాలు, విష వాయువులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. చెత్త డంపింగ్ యార్డ్ వల్ల దమ్మాయిపేట చెరువులో దాదాపు.5 క్వింటాళ్ల చేపలు చనిపోయాయన్నారు. వర్షాలు పడినప్పుడు డంప్ యార్డు ద్వారా నీరు పెద్దఎత్తున బయటకు వచ్చి చెరువుల్లో కలుస్తోందన్నారు. దుర్వాసనతోపాటు నీటి కాలుష్యం వల్ల పంటలు ధ్వంసమవుతున్నాయన్నారు. పాడిపశువులు, చేపలు మృత్యువాతపడుతున్నాయని, ప్రజలకు వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులకు, కలెక్టర్‌కు అనేమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇక్కడి నుంచి డంప్ యార్డును తరలించాలని డిమాండ్ చేశారు.

## నవంబర్ 8న హైదరాబాద్‌లో సిఎస్ఆర్ సమ్మిట్

- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**



దక్షిణ భారతదేశపు అతిపెద్ద కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) సమ్మిట్ హైదరాబాద్‌లో నవంబర్ 8న జరగనున్నది. దీనికి సంబంధించిన పోస్టర్ ను గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరించారు. సమ్మిట్ కార్పొరేట్ నాయకులు, సిఎస్ఆర్ నిపుణులు, పాలసీ మేకర్లు పాల్గొనున్నారు. సామాజిక ఆవిష్కరణలు, సహకార భాగస్వామ్యంపై చర్చించనున్నారు. సమ్మిట్ కోసం హైదరాబాద్‌ను ఎంపిక చేసినందుకు నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రతీక్ ఫౌండేషన్ సిఇవొ గోనరెడ్డి, ఈవెంట్ లైసెన్సీ ఎదుడొడ్ల వినిల్ రెడ్డి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు సీనియర్ సభ్యుల లొంగుబాటు

- జనజీవన స్రవంతిలో కలవండి
- మావోయిస్టులకు రాచకొండ సిపి సుధీర్‌బాబు పిలుపు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మావోయిస్టు దండకారుణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యులు కాకర్ల సునీత అలియాస్ బద్రి అలియాస్ లక్ష్మి అలియాస్ సరోజా, స్టేట్ కమిటీ మెంబర్ చెన్నూరి హరీష్ రాచకొండ సిపి సుధీర్‌బాబు ఎదుట లొంగిపోయారు. వీరు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని, దళసభ్యుల నుంచి కేంద్ర కమిటీ వరకు ఎదిగి, రెండు నెలల కిందట ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్నారు. గురువారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో సిపి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.. కాకర్ల సునీత అలియాస్ బద్రి 1985లో రాజమండ్రిలో ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) పట్ల ఆకర్షితురాలైంది. ఆమె తండ్రి కాకరాల సత్యనారాయణ విప్లవ రచయితల సంఘంలో ముఖ్యమైన నాయకుడు. వరవరరావు, గద్దర్ వంటి విప్లవకారులు తరచుగా వారి ఇంటికి వచ్చేవారు. సునీత 1986లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. కాకర్ల సునీతకు టిఎల్ఎన్ చలం అలియాస్ గౌతం అలియాస్ సుధాకర్‌తో 1986లో వివాహం అయింది. అనంతరం ఆమె మావోయిస్టు పార్టీలో కీలకంగా.. వివిధ ప్రాంతాలు, హోదాల్లో భర్తతో కలిసి పనిచేసింది. వలిగొండ, భైరవకోన, పూజారిగూడ, కుట్ ఎన్‌కౌంటర్లలో పాల్గొంది. ఆమె భర్త చలం 2005లో మావోయిస్టులతో ప్రభుత్వం జరిపిన చర్చలో పాల్గొన్నారు. జూన్ 5, 2025లో అన్నపురం నేషనల్ పార్కు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో చలం మృతిచెందాడు. సునీత తప్పించుకుంది. జనజీవన స్రవంతిలో కలిసిన సునీతకు గతంలో ఆమెపై ఉన్న రూ.20 లక్షల రివార్డును సిపి అందజేశారు. ఈ సమావేశంలో ఎసిపి సత్తయ్యగౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

**ఆయుధాలు వీడండి.. : సిపి**

ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో చేరాలని సీపీ సుధీర్‌బాబు మావోయిస్టులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. సునీత సోదరి మాధవి కూడా పదేండ్ల నుంచి అజ్ఞాతంలో ఉందని, ఆమె కూడా జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 387మంది జనజీవన స్రవంతిలో కలిశారని తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

## గంజాయి ముఠా పట్టివేత

- ముగ్గురు నిందితులకు రిమాండ్
- 106 కిలోల గంజాయి, ఆరు పిస్టళ్లు స్వాధీనం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సుమారు 106 కిలోల గంజాయితోపాటు ఆరు తొమ్మిది ఎంఎం పిస్టళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు, కేరళకు చెందిన నిందితులు ఛత్తీస్‌గఢ్‌లో గంజాయి కొనుగోలు చేసి వ్యాన్‌లో పెట్టుకుని కారులో ఎస్కార్ట్‌గా వస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జగన్నాథపురం వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. కేరళకు చెందిన విఎస్ బిలాల్, తమిళనాడుకు చెందిన శ్యాంసుందర్, కాశీనందన్ సంతోష్‌ను, వ్యాన్‌లో సుమారు 106 కిలోల గంజాయితోపాటు ఆరు తొమ్మిది ఎంఎం పిస్టళ్లను పట్టుకున్నారు. వారిని విచారించగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో అక్రమ ఆయుధాలను కొనుగోలు చేసి కొచ్చికి తరలిస్తున్నట్టు నిందితులు తెలిపారు. అనంతరం ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. అక్రమ ఆయుధాలు, గంజాయి, స్మగ్లర్లను చాకచక్యంగా పట్టుకున్న అధికారులు గణేష్, రమేష్, శ్రీహరి రావుతో పాటు సిబ్బంది కరీం, బాలు, సుధీర్, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, విజయ్, హరీష్, వీరబాబు, ఉపేందర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ శ్రీ శానా వాజ్ కాసీం, డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి అభినందించారు.

## పిఎంకెఎస్‌వై కింద ప్రాజెక్టులు మంజూరు చేయండి

- కేంద్ర మంత్రికి కాంగ్రెస్ ఎంపిల వినతి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పిఎంకెఎస్‌వై) కింద అన్ని జిల్లాలకు వాటర్ షెడ్ ప్రాజెక్టులను మంజూరు చేయాలని ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేష్ షెట్కర్, రఘురామిరెడ్డి తదితరులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఎంపీలు కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు విరివిగా వాటర్ షెడ్లను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ప్రాజెక్టులను సకాలంలో మంజూరు చేసి రాష్ట్ర ప్రయోజనాలకు కాపాడాలని కోరారు. శాస్త్రీయ నీటిపారుదల పద్ధతుల ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయని పేర్కొన్నారు. తద్వారా స్థిరమైన గ్రామీణాభివృద్ధితోపాటు జీవనోపాధి కూడా దొరుకుతుందని వారు వివరించారు.

## రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారునిగా లెఫ్టినెంట్ జనరల్ హర్పల్ సింగ్

- ఉత్తర్వులు జారీ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల శాఖా సలహాదారునిగా మాజీ సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ హర్పల్ సింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నిష్ణాతుడైన హర్పల్ సింగ్ భారత సైన్యంలో నాలుగు దశాబ్దాలకుపైగా విశిష్ట సేవలందించారు. దేశ సరిహద్దుల రహదారుల సంస్థలో డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహించడంతో పాటు భారత సైన్యం ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా ఆయన ముఖ్య భూమిక పోషించారు. ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌గా భారత సైన్యంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో రోహ్తాంగ్ పాస్ కింద అటల్ టన్నెల్ అరుణాచల్ ప్రదేశ్‌లో సెల అండ్ నేచివ్ టన్నెల్‌ల నిర్మాణాలు ఆయన ఆధ్వర్యంలో విజయవంతం అయ్యాయి. అంతే కాకుండా హిమాలయాల ప్రాంతంలో అత్యంత క్లిష్టతరమైన భౌగోళిక పరిస్థితిలను అధిగమించి సొరంగాలను నిర్మించడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు.

సివిల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన హర్పల్ సింగ్ అమెరికాలోని ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయం నుంచి ఉన్నత చదువులు పూర్తి చేశారు. అపార అనుభవంతో పాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో గౌరవప్రదమైన విధులు నిర్వర్తిస్తున్నారు. అంతర్జాతీయ రోడ్ ఫెడరేషన్‌కు అధ్యక్షునిగా, భారత ఇనిస్టిట్యూషన్ ఆఫ్ సివిల్ ఇంజినీర్స్ ఉపాధ్యక్షునిగా, ఇండియన్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ బ్రిడ్జి ఇంజినీర్స్ చైర్మెన్‌గా, ఇండస్ట్రీ కనస్ట్రక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా ఆయన విధులు నిర్వరించారు. సొరంగమార్గాల నిర్మాణంలో ఆయనకున్న అపార అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర నీటి పారుదల శాఖ చేపడుతున్న సొరంగాల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు సొరంగ మార్గాల ఏర్పాటులో ఎదురయ్యే సాంకేతిక సమస్యల నివారణలో ఆయనకున్న సాంకేతిక నైపుణ్యాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఈ నియామకం చేపట్టింది. నీటిపారుదల శాఖను ఆధునిక పరిజ్ఞానం వైపు నడిపించడంతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ నియామకం చేపట్టింది. ఇప్పటికే డిజైన్ విభాగం పునర్వ్యవస్థీకరణ చేపట్టడంతో పాటు వివిధ విభాగాల్లో నిపుణుల నియమకాలను చేపట్టి నీటిపారుదల శాఖను బలోపేతం చేస్తున్న నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పనులను వేగవంతం చేస్తున్న ఆ శాఖకు ఈ నియామకం ఖచ్చితంగా ఓ మైలురాయిలా నిలిచి పోతుందని భావిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం భద్రతకు ఈ నియామకం దోహద పడుతుంది. తద్వారా నీటిపారుదల శాఖ శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవడానికి హర్పల్ సింగ్ నియామకం తోడ్పడు తుందని ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## 30 వరకు క్యూబా సంఘీభావ నిధి స్వీకరణ

- డిజి నర్సింహారావు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

క్యూబాకు సంఘీభావంగా నిధి స్వీకరణ ఈ నెల 30వరకు సంఘీబావ కమిటీ కన్వీనర్ డిజి నర్సింహారవు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సమావేశాన్ని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ అరిబండి ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు వసూలైన నిధి వివరాలను వెల్లడించారు. మొత్తం రూ.ఐదు లక్షలకు పైగా విరాళాలొచ్చినట్టు తెలిపారు. ఇందులో రూ. మూడు లక్షలు జాతీయ సంఘీభావ కమిటీకి క్యూ ఆర్ కోడ్ ద్వారా పంపించినట్టు పేర్కొన్నారు. రూ.రెండు లక్షలు నగదు రూపంలో వసూలు చేసినట్టు తెలిపారు. నిధి వసూళ్లలో పాల్గొన్న సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. సమావేశంలో పిఎస్ఎన్ మూర్తి, జెకె శ్రీనివాస్, కామేశ్ బాబు, కె.ఉమామహేశ్వర రావు, సలీమా, శివకుమార్, ప్రదీప్, వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే నాగరాజు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కైయిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. యూరియా ఇచ్చిన వారికే ఉప రాష్ట్రపతి ఎన్నికలో మద్దతు ఇస్తామంటూ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను పరిష్కరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఆత్మ గౌరవమని చెప్పారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఆయన్ను గెలిపించాలంటూ ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 30 రోజులు జైల్లో ఉంటే ప్రధాని, సిఎం, మంత్రులుగా అనర్హులంటూ కేంద్రం తెస్తున్న బిల్లును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. ఓట్ల దొంగతనం నుంచి తప్పించుకునేందుకే కేంద్రం ఈ బిల్లును తీసుకొస్తున్నదని ఆయన విమర్శించారు.

## ఉపరాష్ట్రపతి అభ్యర్థిని కించపరుస్తారా?

**కెటిఆర్‌కు చనగాని దయాకర్ ప్రశ్న**

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రానికి చెందిన ప్రముఖ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేస్తుంటే, ఆయన్ను కించపరిచేలా మాట్లాడతారా? అని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ కెటిఆర్‌ను ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బిజెపికి కేటీఆర్ ఏజెంట్‌లాగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిపై కెటిఆర్ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. విలువలు గల వ్యక్తిని ఉప రాష్ట్రపతిగా ఎన్నుకోవడం మన రాష్ట్రానికి గౌరవంగా భావించాలని విజ్ఞప్తి చేశారు.

## రైతులకు మరణ శాసనమే

- పత్తి దిగుమతులపై సుంకాన్ని రద్దు చేయడం తగదు : సంయుక్త కిసాన్ మోర్చా

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

పత్తి దిగుమతులపై 11శాతం సుంకాన్ని రద్దు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతులకు మరణ శాసనం రాస్తోందని రాష్ట్ర సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆవేదన వ్యక్తం చేసింది. కేంద్రం తీసుకొచ్చిన ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ గ్రామాల్లో పత్తి రైతులు తీర్మానాలు చేసి ప్రధాన మంత్రి మోడీకి పంపించాలని పిలుపునిచ్చింది. ఈమేరకు గురువారం ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్, పశ్యపద్మ, వి ప్రభాకర్, మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్య, పెద్దారపు రమేష్, కొండల్, నాగిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో దేశీయ పత్తి ధరపై తీవ్రంగా ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి ధర తగ్గడంతో పెట్టిన పెట్టుబడులు రాకపోవడం వల్ల రైతులు మరిన్ని కష్టాలు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. పత్తి దిగుమతుల సుంకాన్ని తొలగించాలనే నోటిఫికేషన్‌ను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాలుకు రూ.10,075 చొప్పున మద్దతు ధర ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రాణం తీసిన పబ్జీ గేమ్

- మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

పబ్జీ గేమ్ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఆనంద నగర్ కాలనీలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మౌలాలి ప్రాంతానికి చెందిన బేతి సంతోష్- సాయిప్రజ దంపతులు కొంత కాలంగా భైంసాలో నివాసముంటూ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బేతి రిశేంద్ర హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ స్కూల్లో తొమ్మిదో తరగతి పూర్తి చేశాడు. అయితే, రిశేంద్ర కొంత కాలంగా పబ్జీ గేమ్‌కు బానిసగా మారాడు. ఇదే క్రమంలో చదువుపై నిర్లక్ష్యం చేసి పదో తరగతి కోసం పాఠశాలకు వెళ్లకుండా ఇక్కడే ఉండిపోయాడు. కుమారుడిలో మార్పు తీసుకొచ్చి చదువుపై దృష్టి పెట్టే దిశగా తల్లిదండ్రులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కానరాలేదు. రెండు మూడ్రోజుల నుంచి పబ్జీ గేమ్ ఆడకుండా కట్టడి చేసినట్టుగా తెలిసింది. దీంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో రిశేంద్ర బుధవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పదవి ఉన్నా, లేకున్నా మీ వెన్నంటి ఉంటా

- కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు
- సింగరేణి కార్మికులకు కవిత లేఖ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికెఎస్) గౌరవాధ్యక్షులుగా ఉన్నా, లేకపోయినా కార్మికుల వెన్నంటి ఉంటానని, వారికి ఏ కష్టం వచ్చినా వారికి అండదండగా ఉంటానని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె సింగరేణి బొగ్గు గని కార్మికులను ఉద్దేశించి లేఖ రాశారు. రాజకీయ కారణాలతోనే కొత్త అధ్యక్షుని ఎన్నిక జరిగిందని భావిస్తున్నట్టు చెప్పారు. నూతనంగా అధ్యక్షునిగా ఎన్నికైన కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పార్టీ అధ్యక్షునిగా తన తండ్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లేందుకు తాను రాసిన లేఖను లీక్ చేసిన ఆ కుట్రదారులే తనను రకరకాలుగా వేధిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం పోరాడుతుంటే కొందరు తనపై చేస్తున్నకుట్రలతో వ్యక్తిగతంగా తనకు నష్టం లేదని స్పష్టం చేశారు.

బిఆర్ఎస్ అధినేత, తన తండ్రి కెసిఆర్‌కు తాను ఎన్నో లేఖలు రాశానని తెలిపారు. అయితే తాను బిఆర్ఎస్ రజతోత్సవ సభలో కెసిఆర్ ప్రసంగంపై ప్రజల అభిప్రాయలను రాసిన లేఖను లీక్ చేశారని గుర్తుచేశారు. ఆ కుట్రదారులను బయటపెట్టాలని తాను కోరితే, ప్రశ్నించడమే తప్పన్నట్టు తనపై కక్ష కట్టారని తెలిపారు. పార్టీ మేలు కోరి లేఖ రాస్తే లీక్ చేసిన కుట్రదారుల పేర్లు బయటపెట్టమంటే కక్ష కట్టి వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. తాను అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో కార్మిక చట్టాలకు విరుద్ధంగా టిబిజికెఎస్ సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించి కొత్త గౌరవ అధ్యక్షుడిని ఎన్నుకున్నట్టుగా ప్రకటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే సంస్థలో డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చే పద్ధతిని పక్కన పెడితే కెసిఆర్‌ను ఒప్పించి తిరిగి డిపెండెంట్ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరించేలా చేసి 19,463 మంది యువతకు ఉద్యోగాలు ఇప్పించానని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తెలంగాణ ఇంక్రిమెంట్, రూ.పది లక్షలకు పైబడిన హౌసింగ్ లోన్‌పై వడ్డీ చెల్లింపు, కార్మికులు నివసించే క్వార్టర్స్‌కు ఉచిత కరెంట్, ఉచిత ఎసి సదుపాయం, మ్యాచింగ్ గ్రాంట్ పది రెట్లు పెంచేందుకు పాటు పడినట్టు ఆమె చెప్పారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన కార్మిక కుటుంబాల్లోని పిల్లలకు ఫీ రీయింబర్స్ మెంట్ సదుపాయం తీసుకొచ్చానని పేర్కొన్నారు.

# వైద్యారోగ్యశాఖలో రెండ్రోజుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల నోటిఫికేషన్

- 1,623 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం
- ఇప్పటికే 8 వేల పోస్టుల భర్తీ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

వైద్యారోగ్యశాఖలో మరోసారి భారీ నోటిఫికేషన్ వెలువడనున్నది. 1,623 మంది స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఇప్పటికే వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యసేవల నియామక మండలి (మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు)ను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో బోర్డు ఒకట్రెండు రోజుల్లో ఆ పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నది. ఈ పోస్టుల భర్తీ అయితే తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరగనున్నది. వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉండే జిల్లా, ఏరియా ఆస్పత్రులతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వీరి రాకతో వైద్యసేవలు మరింత మెరుగుపడనున్నాయి. గ్రామాలకు స్పెషాలిటీ వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి.

మెరుగైన ఆరోగ్యసేవలందించేందుకు ఇప్పటికే 8 వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 7 వేల పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. 2,322 నర్సింగ్ ఆఫీసర్లు, 1,284 ల్యాబ్ టెక్నీషియన్, 732, ఫార్మసిస్ట్, 1,931 ఎంపిహెచ్ఎ ఫిమేల్ (ఎఎన్ఎం) పోస్టులకు పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. వీటిలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్లకు ఫలితాలకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్టులను బోర్డు విడుదల చేసింది. ఎంపీహెచ్ఎ ఫిమేల్ (ఎఎన్ఎం) పోస్టుల్లో ప్రభుత్వ వైద్యసంస్థల్లో పని చేసిన కాంట్రాక్ట్ సిబ్బందికి వెయిటేజీ ఉండటంతో వారి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు. అదే విధంగా ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 కు సంబంధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తైంది. మొత్తం 6,269 పోస్టుల ఫలితాలు విడుదల కావాల్సి ఉన్నది. ఈ పోస్టుల ఫలితాల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,17,658 మంది ఎదురు చూస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల కోసం 24,045 మంది, నర్సింగ్ ఆఫీసర్ల పోస్టుల కోసం 42,244 మంది, ఎంపిహెచ్ఎ ఫిమేల్ పోస్టుల కోసం 24,268 మంది, ఫార్మసిస్ట్ గ్రేడ్-2 పోస్టుల కోసం 27,101 మంది దరఖాస్తులు చేసుకున్న సంగతి తెలిసిందే.

ఆస్పత్రుల్లో పేద రోగులకు వైద్యసేవలందించే వైద్యులు, పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది భర్తీతో పాటు వైద్యవిద్య బలోపేతానికి పోస్టుల భర్తీ వేగంగా చేపట్టాలని నిర్ణయించారు. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్, నాలుగు స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. మరోవైపు రాష్ట్రాన్ని నకిలీ మందులరహిత రాష్ట్రంగా తీర్చి దిద్దేందుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు, ఆహార కల్తీని పూర్తిగా నిరోధించేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులకు సంబంధించి వైద్యారోగ్యశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనలకు ఆర్థికశాఖ నుంచి ఆమోదం లభించాల్సి ఉంది.